

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్

ఆచంట: వశిష్ట గోదావరి వరద ఉధతి పెరుగుతున్న నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని నర్సాపురం ఆర్డీవో ఎం అచ్యుత్ అంబరీస్ అన్నారు. ఆదివారం సాయంత్రం కోడేరు వద్ద గోదావరి ఉధృతిని పరిశీలించి అధికారులను వివరాలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరద నీరు సముద్రంలోకి వదులుతున్న నేపథ్యంలో ధవళేశ్వరం వద్ద వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. లంక గ్రామాలు ప్రస్తుతానికి సురక్షితంగా ఉన్నాయని, రెండు మూడు రోజుల్లో వరద ఉధృతి ఇలాగే ఉంటే పల్లప్రాంతాల్లోకి నీరు ప్రవేశించే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పుష్కర ఘాట్‌లో పోలీసు బందోబస్తు ఏర్పాటు ఎస్ఐ రాజకుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు.

ఇళ్లు కూలే.. పంట పొలాలు పోయే..!




'నాపేరు కుంజె ధర్మయ్య, వేలేరుపాడు మండలం అల్లూరి నగర్. పెదవాగు ప్రాజెక్టు గండిపడి నీరు ఊళ్లపై పడఘంతో గతంలో ప్రభుత్వం ఇచ్చిన కాలనీ ఇళ్లు మొత్తం కొట్టుకుపోయాయి. శ్లాబు దూరంగా వెళ్లి పడిపోయింది. షెడ్డు కూడా కొట్టుకుపోయింది. నలుగురు కుటుంబ సభ్యులం పక్క ఇంట్లో తలదాచుకుంటున్నాం. టార్పిన్లు ఇస్తే తాత్కాలిక వసతి ఏర్పాటు చేసుకుంటాం. కట్టుబట్టలతో రోడ్డున పడ్డాం. ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకుంటున్నాం'



'నా పేరు మందోటి ఏసుబాబు, కోయమాధవరం. ఆరెకరాల్లో మిర్చి నారు, నాలుగెకరాల్లో పత్తి దెబ్బతింది. దాదాపు రూ.లక్ష నష్టం వాటిల్లింది. పొలాల్లో ఇసుక మేటలు వేసింది. ప్రాజెక్టు కొట్టుకుపోవడంతో ఇక ఈ ఏడాదికి సాగులేనట్లే.. పొలాల్లో ఇసుక మేటలు తేరడంతో సాగుకు పనికి వచ్చే పరిస్థితి కనపడం లేదు. ఇళ్లు కూలిపోయి, పంటపొలాలు దెబ్బతిన్నాయి. కట్టుబట్టలతో రోడ్డున పడ్డాం. ప్రభుత్వం ఆదుకుని న్యాయం చేయాలని కోరుతున్నాం'

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, వేలేరుపాడు, జంగారెడ్డిగూడెం టౌన్

వేలేరుపాడు మండలంలోని పెదవాగు ప్రాజెక్టు బాధిత గ్రామాల్లో ఎవరిని కదిపినా ఇలాంటి హృదయ విదారకర ఘటనలే కనిపిస్తున్నాయి. ఇళ్లు కూలిపోయాయి. పంట పొలాల్లో ఇసుక మేటలు వేసి నారుమడులన్నీ ధ్వంసమయ్యాయి. పొలాలు సాగుకు పనికిరాకుండా పోయాయి. కట్టుబట్టలతో రోడ్డున పడ్డాం.. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలంటూ' బాధితులు పెడుతున్న ఆర్తనాదాలు అందరినీ కంటతడి పెట్టిస్తున్నాయి. పెదవాగు ప్రాజెక్టుకు గండిపడడంతో ముంపునకు గురైన గ్రామాల్లో ఆదివారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మంతెన సీతారాం ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా నాయకుల బృందం పర్యటించింది. అల్లూరినగర్, కోయమాధవరం, మద్దిగూడెంలో పర్యటించిన సిపిఎం నాయకులకు బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఒక్క రాత్రితో తమ పరిస్థితి తారుమారైపోయిందంటూ కన్నీరుమున్నీరయ్యారు. ఇళ్లు, ఇంట్లో సామాన్లు కొట్టుకుపోయాయి. వరి, మిర్చి, పత్తి నారుమడులు మొత్తం దెబ్బతిన్నాయి. దాదాపు 4 వేలకు పైగా ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని అక్కడి రైతులు తెలిపారు. ఎకరాకు రూ.30 వేలకు పైగా పెట్టిన పెట్టుబడులు గంగలో కలిసిపోయాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పునరావాస కేంద్రం దూరంగా ఏర్పాటు చేయడంతో అక్కడకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అల్లూరి నగర్‌లో 85 ఇళ్ల ఉండగా 45 ఇళ్లు కొట్టుకుపోయాయి. దెబ్బతిన్న మిగిలిన ఇళ్లలోనే అంతా తలదాచుకుంటున్నాం. ఒక్కో ఇంటికి కనీసం లెక్కించినా రూ.నాలుగు నుంచి రూ.ఐదు లక్షలు నష్టపోయామంటూ బాధితులు తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. బాధితుల సమస్యలను మండల, జిల్లా, రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతోపాటు, ప్రభుత్వంలో పెద్దలకు, వివరించి న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామంటూ సిపిఎం నాయకుల భరోసా ఇచ్చారు. అధికారులు భోజనం మాత్రం అందిచగలుగుతున్నారని, తమకు కావాల్సిన వంటపాత్రలు, గ్యాస్ బండలు, నిత్యావసర వస్తువులు ఇస్తే తాము వంట చేసుకుంటామంటూ బాధితులు కోరుతున్న పరిస్థితి నెలకొంది. అందరూ కలిసికట్టుగా పోరాడదామంటూ బాధితులకు సిపిఎం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎం.హరిబాబు, జిల్లా నాయకులు డివిఎస్‌విడి ప్రసాద్, తెల్లం రామకృష్ణం, తెల్లం దుర్గారావు, మొడియం నాగమణి. మడివి దుర్గారావు, ధర్మల రమేష్, యర్రంశెట్టి నాగేంద్రరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



కోయమాధవరం బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

వేలేరుపాడు మండలం
పెదవాగు ప్రాజెక్టు బాధితుల అరణ్యరోదన
కట్టుబట్టలతో రోడ్డున పడ్డామంటూ కన్నీరుమున్నీరు
టార్పిన్లు సైతం ఇవ్వకపోవడంపై ఆవేదన
వంట పాత్రలు, గ్యాస్ బండ ఇవ్వాలంటూ వేడుకోలు
సిపిఎం బృందం వద్ద బాధితులు కష్టాలు ఏకరువు



వరదకు పూర్తిగా దెబ్బతిన్న అరటి పంట

టార్పిన్లు ఇస్తే తాత్కాలిక వసతి ఏర్పాటు చేసుకుంటాం

ఇళ్లు కొట్టుకుపోవడంతో నిలువ నీడలేకుండా పోయింది. పక్కా ఇళ్లలో తలదాచుకుంటున్నాం. టార్పిన్లు ఇస్తే తాత్కాలిక వసతి ఏర్పాటు చేసుకుంటాం. కూలిపోయిన ఇళ్ల ప్రాంతంలో ప్రభుత్వం పక్కా ఇళ్లు నిర్మించాలని బాధితులు కోరుతున్న పరిస్థితి నెలకొంది. సిపిఎం నాయకుల మాట్లాడుతూ బాధితులకు టార్పిన్లు వెంటనే అందించాలని, తక్షణ సాయం కింద రూ.పది వేలు అందించి, నష్టపరిహారం తేల్చి పరిహారం ఇవ్వాలన్నారు. బాధితులకు నిత్యావసర వస్తువులు, వంట పాత్రలు, బట్టలు, ఇతర సామగ్రి అందిచాలన్నారు. దెబ్బతిన్న ప్రాజెక్టును వెంటనే యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలన్నారు. పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. 15 గ్రామాల్లో తీవ్ర విపత్తు ఏర్పడిందన్నారు. అసెంబ్లీలో దీనిపై చర్చించాలన్నారు.

నేడు 'మీ కోసం' రద్దు

ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, అంగన్వాడీలకు సెలవు
కలెక్టర్ నాగరాణి



ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ 'మీ కోసం' రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే మండల, డివిజన్ స్థాయిలో జరగాల్సిన మీ కోసం కార్యక్రమాలను కూడా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా శాఖల అధికారులు గమనించాలని పేర్కొన్నారు. అలాగే జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, అంగన్వాడీలకు కూడా సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పెరుగుతున్న వశిష్ట గోదావరి ప్రవాహం
జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

భారీ వర్షాలు, వరదలు మూలంగా తలెత్తే పరిణామాలను పక్కా ప్రణాళికతో సమర్థవంతంగా ఎదుర్కొంటూ ఎటువంటి ప్రాణ, ఆస్తి, పశునష్టం జరుగకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని, ప్రజలంతా మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలో గోదావరి నది పరివాహక మండలాలు, లంక ప్రాంతాలు నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, ఆచంట, పెనుగొండ మండలాలపై ఎక్కువ దృష్టి పెట్టామన్నారు. ప్రస్తుతం వర్షాల ప్రభావం తగ్గుతున్నను, ఎగువన కురుస్తున్న వర్షాలు వల్ల వరదల రూపంలో జిల్లాకు ప్రమాదం వచ్చే అవకాశం ఉందని, అధికార యంత్రాంగాన్ని సంసిద్ధులను చేసామని, ప్రజలంతా అప్రమత్తంగా ధైర్యంగా ఉండాలన్నారు. వరదలు, వర్షాలు మరింత పెరిగితే ముంపుకు గురయ్యే గ్రామాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు వచ్చుటకు సిద్ధంగా ఉండాలన్నారు. ఇప్పటికే తుఫాన్ రక్షిత భవనాలు, ప్రభుత్వ భవనాలు సిద్ధం చేశామని, ప్రజలంతా పునరావాస, సురక్షిత ప్రాంతాలకు రావాలని జిల్లా కలెక్టరు కోరారు. పునరావాస కేంద్రాలకు తరలించే ముందుస్తు కార్యాచరణ అమలు జేసేందుకు ఆయా కేంద్రాల్లో అవసరమైన బియ్యం, గ్యాస్, కూరగాయలు, నూనె, పప్పు, కొవ్వొత్తులు, తదితర వాటిని అధికారులు, సిబ్బందితో సిద్ధం చేశామన్నారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా జనరేటర్లను సిద్ధం చేసుకోవాలన్నారు. భద్రాచలం, ధవలేశ్వరం గోదావరి నీటిమట్టాలు, రోజూ కురుస్తున్న వర్షాల పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎక్కడైనా ఏదైనా సమస్య ఉత్పన్నమైతే అధికారులు ఎటువంటి సంకోచం లేకుండా ముందు పరిష్కారం చూపి, తర్వాత తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గోదావరి పరివాహక ఏటిగట్లను నిరంతరం నిఘా పెంచాలని, ఎక్కడైనా బలహీనంగా అనుమానాలు ఉన్నచో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. ఇసుక బస్తాలు, సర్వే బాదులు, వెదురు తడికలు, తదితర సామాగ్రి, సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పునరావాస కార్యక్రమంలో భాగంగా ప్రతి హ్యాబిటేషన్, ప్రతి పునరావాస కేంద్రానికి నియమించిన నోడల్ అధికారుల వివరాలను అందించాలన్నారు. పునరావాస కేంద్రాలలో తాగునీరు, భోజన ఏర్పాట్లను, జనరేటర్లు, మెడికల్ క్యాంపులు, సిబ్బంది సిద్ధం చేయాలన్నారు. గోదావరి వరదే కాకుండా జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు దృష్ట్యా అన్ని మండలాల తహశీల్దార్లు కూడా నిరంతరం ప్రత్యేక పర్యవేక్షణ, ప్రతి డివిజన్ ఆర్‌డిఒ కార్యాలయాలు, అన్ని మండల తహశీల్దార్లు కార్యాలయాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు మూలంగా సంభవించే పరిస్థితులను అంచనావేస్తూ దానికి అనుగుణంగా చర్యలు వెనువెంటనే తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో బాధ్యతగల సిబ్బందిని లైజన్ అధికారిగా నియమించాలని, మండల అధికారులు, సిబ్బంది ఆయా గ్రామాల్లో మాకాం వేయాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. అవసరమైన చోట మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసుకోవాలని, ముఖ్యంగా పాము కాటు, కుక్క కాటు మందులు తప్పనిసరిగా ఉండాలన్నారు. భద్రపరుచుకునేలా, ఎవరూ చేపల వేటకు వెళ్లకుండా చూడాలని, అనధికార పడవలు గోదావరి, కాలవలపై వెళ్లనీయ్యవద్దని, వేట బోట్లను సముద్రంలోకి వెళ్లకుండా చూడాలని మత్స్యశాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను జిల్లాలకు చేరుకోవాలని ఆదేశించామన్నారు.

గోదా 'వర్రీ'

- భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- 43 అడుగులకు చేరిన నీటిమట్టం
- దిగువకు 8.85 క్యూసెక్కుల విడుదల
- గంట గంటకూ ప్రమాదకరంగా పరిస్థితి
- వేలేరుపాడు, కుక్కునూరు మండలాలను చుట్టేస్తున్న వరద
- అప్రమత్తమైన అధికారులు
- నేడు ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్లకు సెలవు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గోదావరి ఉగ్రరూపం దాల్చింది. వరద నీరు పోటెత్తుతోంది. గంట గంటకూ పరిస్థితి ప్రమాదకరంగా మారుతోంది. ఆదివారం రాత్రికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 43 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీఅయ్యింది. దిగువకు 8.85 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సోమవారం ఉదయానికి భద్రాచలం వద్ద నీటిమట్టం 48 అడుగులకు చేరనుందని రెండోప్రమాద హెచ్చరిక జారీ అయ్యే పరిస్థితి ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో వేలేరుపాడు, కుక్కునూరు మండలాలను వదర నీరు చుట్టుముడుతోంది. దీంతో అక్కడి ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలను యుద్ధప్రాతిపదికన సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. గోదావరి నదికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయినవెంటనే వేలేరుపాడు మండలంలోని వరద ప్రభావిత గ్రామాల ప్రజలను సహాయక కేంద్రాలకు తరలించే కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి జిల్లా కె. వెట్రిసెల్వి, ఎస్పీ కె. ప్రతాప్ శివకుమార్ లతో కలిసి దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ భద్రాచలం వద్ద గోదావరి వరద నీటిమట్టం మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకుందని, వరద నీటిమట్టం పెరుగుతున్న స్థాయిని అనుసరించి ఇరిగేషన్ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయము చేసుకుని మిగిలిన ప్రాంతాలలో కూడా వరద కారణంగా ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, వరద సహాయక కార్యక్రమాలు ప్రారంభించాలన్నారు. కుక్కునూరు మండలంలోని గొమ్ముగూడెం, లచ్చిగూడెం గ్రామాలకు కల్వర్టులు మునిగి రవాణా వ్యవస్థ స్తంభిస్తుందని, గొమ్ముగూడెం లోని 250 కుటుంబాలను దారాచారంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీకి, లచ్చిగూడెం గ్రామంలోని 47 కుటుంబాలను కొండపై ఉన్న ప్రాంతంలో వరద ఉధ్రితి తగ్గేవరకు తాత్కాలిక వసతి కల్పించాలన్నారు. వారికి మూడు రోజులకు సరిపోయే విధంగా బియ్యం, అరకేజీ కందిపప్పు, అరకేజీ వంటనూనె, వాటర్ ప్యాకెట్లు, 5 రకాల కూరగాయలు ప్రతీ కుటుంబానికి అందించాలన్నారు. అదేవిధంగా ఇటీవల పెదవాగు వరద కారణంగా దెబ్బతిన్న వేలేరుపాడు మండలంలోని దెబ్బతిన్న గ్రామాల ప్రజలకు ఆహారం, త్రాగునీరు పూర్తిస్థాయిలో అందించాలన్నారు. వేలేరుపాడు మండలం అల్లూరినగర్‌లో పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లకు 15 టార్పాలిన్లు అందించడం జరిగిందని, మిగిలిన గ్రామంలో కూడా ఇళ్లు దెబ్బతిన్న కుటుంబాలకు టార్పాలిన్లు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వరద సహాయక కార్యక్రమాల్లో ఎక్కడా ఏ విధమైన ఫిర్యాదులకూ తావులేకుండా బాధితులను ఆదుకునేలా అధికారులు పనిచేయాలన్నారు. వరద ముంపు ప్రాంతాలైన వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో మూడునెలల అడ్వాన్స్ రేషన్ సిద్ధంచేసినట్లు అధికారులు తెలిపారు. వేలేరుపాడు మండలంలో 2,606 క్వింటాళ్ల బియ్యం, 7,627 కిలోల కందిపప్పు, కుక్కునూరు మండలంలో 4,066 క్వింటాళ్ల బియ్యం, 12,193 క్వింటాళ్ల కందిపప్పు, ఆయా పునరావాస కేంద్రాల సమీపంలో నిల్వలు అందుబాటులో ఉంచామని, వంట నూనె స్టాక్ చేసినట్లు అధికారులు తెలిపారు.



భద్రాచలం వద్ద 43 అడుగులకు చేరిన నీటిమట్టం

ఆచంట: ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో గోదావరి ఉధృతంగా ఉంది. నాలుగు రోజులుగా నీటిమట్టం పెరుగుతుండడంతో గోదావరి నడుమ జీవిస్తున్న లంకవాసుల్లో ఆందోళన మొదలైంది. ధవళేశ్వరం వద్ద నీటి విడుదలను పెంచడంతో దిగువున నియోజకవర్గం పరిధిలో లంక గ్రామాలు ముంపు బారిన పడే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే తీరం వెంబడి ఉన్న పుష్కర ఘాట్లు నీటమనడం ప్రారంభమయ్యాయి. నీటి ప్రవాహం మరింత పెరగడంతో పల్లపు ప్రాంతంలోని లంక భూముల్లోకి వరద నీరు చేరుతోంది.

లంక భూముల్లో విలువైన పంటలు..

ఆచంట మండల పరిధిలోని అయోధ్యలంక, పుచ్చలంక, పెదమల్లంలంక, ఆనగార్లంక, పల్లిపాలెం, కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురం తదితర గ్రామాల్లోని లంకభూముల్లో ప్రస్తుతం విలువైన పంటలు సాగుతున్నాయి. ముఖ్యంగా తీరాన్ని ఆనుకుని ఉన్న పల్లపు భూముల్లో పలు రకాల కూరగాయ పంటలను లంక రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం చేతికొచ్చే దశకు చేరాయి. ఈ తరుణంలో గోదావరి వరద మరింత ఉధృతం అయితే పంటలు ముంపు బారిన పడే ప్రమాదం పొంచి ఉంది. గతేడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వచ్చిన వరద మూలంగా కోడేరు, కరుగోరుమిల్లి, లంక గ్రామాల్లోని పంటలు ముంపుబారిన పడి కుళ్లిపోయాయి. దీంతో ప్రస్తుతం ఆయా రైతుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే రైతులు ఎకరానికి సుమారు రూ.50 వేల వరకూ పెట్టుబడులు పెట్టారు. వరద ఉధృతి పెరిగితే తాము తీవ్రంగా నష్టపోవడం ఖాయమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క తీరం వెంబడి విలువైన భూములు కోతకు గురవుతున్నాయని రైతులు వాపోతున్నారు.

నీటిలోనే వరినాట్లు..

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోనిక్కల తాడేరు డ్రెయిన్లు ఉధృతంగా ప్రవహించడంతో ఊహించని రీతిలో సుమారు 1500 ఎకరాల వరకూ వరినాట్లు నీట మునిగాయి. రోజురోజుకూ ఉధృతి పెరగడంతో మరికొన్ని పొలాలు ముంపు బారిన పడుతున్నాయి. అడుగు మేర నీరు నిలిచిపోయింది. కాలువల్లో డ్రెయిన్లలో నీరు ఉధృతంగా ప్రవహించడంతో పలు పంట పొలాల్లోని నీరు బయటకు వెళ్లే మార్గం లేకుండా పోయింది. ప్రధాన ఆర్‌అండ్‌బి రహదారికి ఇరువైపులా ఉన్న పంట పొలాల్లో సుమారు నాలుగు అడుగుల మేర నీరు నిలిచిపోయింది. ఈ పొలాల్లోని గత నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొనడంతో దుబ్బులు కుళ్లిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

పెనుమంట్రలో 2,430 ఎకరాల్లో నాట్లు మునక

పెనుమంట్ర : మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 2,430 ఎకరాల్లో వరినాట్లు పూర్తియ్యాయని, 42 ఎకరాల్లో నారు మడులు నీట మునిగాయని స్థానిక వ్యవసాయ అధికారిణి ఎ.జ్యోషిలా తెలిపారు. మండలంలో మొత్తం వరి పొలాల విస్తీర్ణం 12,206 ఎకరాలు కాగా, నాట్లు 8,200 ఎకరాల్లో పూర్తి అయ్యాయని, వర్షం వల్ల ముంపు బారిన పడిన పొలాలు 2,472 ఎకరాలని ఆమె అన్నారు.

పాలకొల్లు: వరుసగా 4వ రోజు పాలకొల్లులో వర్ష ప్రభావం తగ్గినప్పటికీ ఇంకా చినుకులతో ఆదివారం ప్రజలు ఇబ్బంది పడ్డారు.



ఆచంట : నీట మునిగిన వరినాట్లు

గంట తెరిపి ఇవ్వడం మరో గంట చినుకులు ఇలా రోజంతా వాతావరణం ఉంది. పలుమార్లు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. ఇదిలా ఉండగా పోలీస్, రెవెన్యూ సిబ్బందిని యలమంచిలి మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో డ్యూటీలు వేస్తున్నారు. పట్టణ శివారు ప్రాంతాల్లో నారుమడులు మునిగి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మొగల్తూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత నాలుగు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షం అన్నదాతలను నిండా ముంచింది. తీవ్ర నష్టం వాటిల్లింది. నారుమడులు, వరినాట్లు నీటమునిగాయి. మూడు రోజులుగా వరినారు నీటిలోనే మునిగి ఉండటంతో దెబ్బతింటున్నాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇదే వర్షం మరికొన్ని రోజులు కొనసాగితే నష్టం తీవ్రంగా ఉంటుందని మరో పర్యాయం నారుమడి వేసుకోవాల్సిందేనని అన్నదాతలు వాపోతున్నారు.


నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ముంపు ప్రాంతాల్లో సిపిఎం, ప్రజా సంఘాల నేతల పర్యటన


ప్రజాశక్తి - పాలకోడేరు

జిల్లాలో గత కొన్ని రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రైతాంగం పూర్తిగా నష్టపోయిందని తక్షణం ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. వర్షాల ధాటికి నారుమడ్లు, నాట్లు వేసిన వరి చేలు వేలాది ఎకరాలు నీటిలోనే నాని కుళ్లిపోయి ఎందుకూ పనికి రాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి మళ్లీ నారుమడులు, నాట్లు వేయాలంటే ఖర్చుతో కూడుకున్న పని అని, రైతులను ఆదుకునే విధంగా విత్తనాలు ఎరువులు పురుగు మందులు సగం సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు. విస్సాకోడేరులో ముంపునకు గురైన వరిచేలను సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్‌తో కలిసి ఆదివారం బలరాం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు అనేక సమస్యలను బలరాం దృష్టికి తీసుకొచ్చారు. దాళ్వా పంటకు సంబంధించిన ధాన్యం డబ్బులు ఇప్పటివరకూ ఇవ్వలేదని చెప్పారు. అప్పులు చేసి ఇప్పటివరకూ సార్వసాగులో రూ.10 వేల నుంచి రూ.13 వేల వరకూ ఖర్చు పెట్టామని, వర్షాలకు వరిచేలన్నీ నీటమునిగాయని తెలిపారు. స్పందించిన బలరాం రైతుల్లో ధైర్యాన్ని నింపి మాట్లాడారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా రైతుల పరిస్థితులు మారకపోవడం దారుణం అన్నారు. జిల్లాలో కురుస్తున్న వర్షాలకు వేలాది ఎకరాలు ముంపు బారిన పడ్డాయన్నారు. తక్షణం ప్రభుత్వం రైతులకు ఎరువులు పురుగుమందులు విత్తనాలు సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సుమారు రూ. 400 కోట్లు బకాయి పేరుకుపోయిందని, తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాలన్ మాట్లాడుతూ ఎర్ర కాలువ ఉధృతకి యనమదుర్రు డ్రెయిన్ ఉగ్రరూపం దాల్చిందని, దీంతో పంట పొలాలు ముంపునకు గురయ్యాయన్నారు. తక్షణం ప్రభుత్వం వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వీరి వెంట సిపిఎం నాయకులు కలిదిండి గోపాలరాజు, రైతులు ఉన్నారు.

పెనుగొండ : చినుకు పడితే ఉప్పొంగే నక్కల మురుగు కాల్వ రైతుల పట్ల దుఃఖ దాయినిగా మారుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో పెనుగొండ, వడలి, మునమర్రు, కొఠాలపర్రు, సోమరాజు చెర్వు ప్రాంతాల్లో పర్యటించి సోమరాజు చెర్వు వద్ద నీట మునిగిన పొలాలను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. మునిగిన వరి చేలను అధికారులు పరిశీలించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతులు అప్పారి శ్రీనివాస్, ధర్నాల సూర్యనారాయణ, చిలుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పాలకోడేరు : నీట మునిగిన వరి దుబ్బులను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం



తాడేపల్లిగూడెం : ముంపుప్రాంతాల్లో పర్యటిస్తున్న రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం నేతలు

భీమవరం : గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు యనమదుర్రు డ్రెయిన్ పొంగి పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయని, ప్రజానీకానికి పునరావాసం కల్పించాలని సిపిఎం పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. ముంపు ప్రాంతాల్లో సిపిఎం నేతలు ఆదివారం పర్యటించి బాధిత ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు మాట్లాడారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించాలని, వరద తగ్గే వరకూ పునరావసం కల్పించి భోజనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజలను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు డి.త్రిమూర్తులు, కొమరగిరి సాయమ్మ, కుమారి సోమేశ్వరరావు, పాల్గొన్నారు.

గణపవరం : మండలంలో వర్షాల కారణంగా ముంపునకు గురైన పిప్పర, కేశవరం, అప్పన్నపేట, జల్లికాకినాడ, వెంకట్రాజపురం గ్రామాల్లో పంట పొలాలను, సిపిఎం మండల కమిటీ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ కార్యదర్శి పి.నరసింహమూర్తి, నాయకులు పి.గోవిందు, చిన్నం చిన్న నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో మండల నాయకులు ఎస్.సంజీవరావు పాల్గొన్నారు.

పెంటపాడు : సిపిఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో ఆయా నాయకులు బృందంగా బయలుదేరి మండలంలోని పంట పొలాలను జట్లపాలెం, ఉమామహేశ్వరం, మౌంజిపాడు, పడమర విప్పర్రు, కె.పెంటపాడు, యానాలపల్లి పరిమళ్ల గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి, సిపిఎం నాయకులు బంకురు నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు మరపట్ల దానయ్య మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతులకు విత్తనాలు ఎరువులు, పురుగు మందులు, పెట్టుబడి సాయం అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పెనగంటి దుర్గా, గోక భీముడు, నల్లమామిడి సత్యనారాయణ, కొమ్ము సురేష్, జాషువా, తాడి శ్రీను పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: నష్టపోయిన కౌలు రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని రైతుసంఘం జిల్లా నాయకులు చింతకాయల బాబురావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎర్రకాలవ ముంపుకు గురైన నందమూరు, మారంపల్లి, జగన్నాధపురం, మాధవరం గ్రామాల్లో రైతు సంఘం నాయకులు చింతకాయల బాబురావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఖండెల్లి సోమరాజు పర్యటించి రైతులను, కౌలు రైతులను, నీట మునిగిన పేదల ఇళ్ల దారులను పరామర్శించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కౌలు రైతులు మాట్లాడుతూ ప్రతిసంవత్సరం ఎర్రకాలవ ముంపుకు గురవుతూనే ఉన్నామని, పంట నష్ట పరిహారం విషయానికి వచ్చేసరికి కౌలు రైతులకు అన్యాయం జరుగుతుందని వాపోయారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు, రైతు సంఘం జిల్లా నాయకులు మాట్లాడుతూ నందమూరు గ్రామంలో 500 ఎకరాలు, జగన్నాధపురంలో 950 ఎకరాలుపైన, మాధవరంలో 1200 ఎకరాలు నీటమునిగాయని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టపరిహారాన్ని అంచనా వేసి వాస్తవ సాగుదారులను గుర్తించి, 90 శాతం భూమి కౌలు రైతుల చేతుల్లో ఉంది కాబట్టి కౌలు రైతులకు పంట నష్టపరిహారం ఎకరాకు రూ.20 వేలు చొప్పున అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు, ప్రజాసంఘాల నాయకులు చిన్నం చిన నాగేశ్వరరావు, కట్టారి ప్రసాద్, మల్లులు పరమేశుపాల్గొన్నారు.

ఆచంట: ఏ ప్రభుత్వమైనా రైతుల పట్ల, మురుగు కాలువలపట్ల నిర్లక్ష్యం కారణంగానే రైతాంగం తీవ్రంగా నష్టపోయి ఆర్థికంగా భారీ మూల్యం చెల్లిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. అధిక వర్షాలకు ముంపునకు గురైనా నారుమళ్లు, వరిపొలాలను పరిశీలించేందుకు ఆచంట మండలంలోని వల్లూరు, ఎ.వేమవరం, వంకతాళ్ల చెరువు గ్రామాల్లో ఆయన ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో వేలాది ఎకరాల్లో ప్రధానంగా నారుమళ్లు, కొన్ని ప్రాంతాల్లో వరినాట్లు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. దీని ప్రధాన కారణం ఏళ్ల తరబడి మురుగు కాలువలను ఆధునీకరించడం లేదన్నారు. వల్లూరు నుంచి కట్టుకాలువ వరకు ఉన్న మురుగు కాలువలో తూడు, గుర్రపుడెక్క పెరిగి పోవటంతో గ్రామంలోని ఈత కోటపాలెం, శీలంవారి పాలెం తదితర ప్రాంతాల్లో పూర్తిగా పంటలు దెబ్బతిన్నాయన్నారు. తక్షణం కాలువలను పూర్తి స్థాయిలో ఆధునీకరించి పంటలను కాపాడాలని, పంటలు దెబ్బతిన్న కౌలురైతులకు విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం ఉచితంగా అందించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలురైతులు బి.సుబ్బారావు, సాకా సూర్యప్రకాశరావు, మేడిద సాంబయ్య, నార్ని సీతారామయ్య, కె.పూర్ణారావు, బి.ధర్మారావు, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

సూచించిన డిఇ బళ్ల సురేష్‌కుమార్



ప్రజాశక్తి - నరసాపురం

వర్షాకాలం విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని నరసాపురం విద్యుత్ శాఖ డిఇ బళ్ల సురేష్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయనను ప్రజాశక్తి పలకరించగా విద్యుత్ ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. తడిసిన కరెంట్ స్థంబాలను ముట్టుకోరాదని తెలిపారు. విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్లను తాకరాదని అన్నారు. విద్యుత్ తీగలు చెట్టుకొమ్మలకు తగిలితే సంబంధిత అధికారికి తెలియజేయాలని సూచించారు. పార్కులలో గాని, స్టేడియంలో గాని విద్యుత్ స్థంబాలు ముట్టుకోరాదని తెలిపారు. ఇంట్లో వున్న స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోరాదని చెప్పారు. బయటపెట్టిన లైట్లు నీటితో తడవకుండా చూసుకోవాలని, కరెంటుకు సంబంధించిన వస్తువులు తడి చేతులతో తాకరాదని, చిన్న పిల్లలను కరెంటు వస్తువుల వద్దకు రాకుండా చూసుకోవాలని, ఉతికిన బట్టలు ఇనుప తీగెలపై వేయకూడదని తెలిపారు. గాలి, దుమారం, వర్షం వల్ల తెగిన విద్యుత్ వైర్లను ముట్టుకోరాదన్నారు. ఇంట్లో వున్న వాటర్ హీటర్ స్విచ్ ఆఫ్ చేసి ప్లగ్ తీసిన తర్వాతనే నీళ్లు పెట్టిన వస్తువును ముట్టవలెనని తెలిపారు. ఉరుములు, మెరుపులతో వర్షం పడేటప్పుడు 'డిష్' కనెక్షన్ తీసివేయవలెనన్నారు. వర్షం పడుతున్నప్పుడు టివి, ఫ్రిడ్జ్, వాటర్ మోటర్స్, కంప్యూటర్లు స్విచ్ ఆఫ్ చేయాలని, లేనిచో వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం వుందని తెలియజేశారు. కరెంటు లైన్ల కింద సెల్ ఫోన్ పెట్టకూడదని తెలిపారు. ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్ ఏమైనా డ్యామేజ్ అయినచో సంబంధించిన అధికారి దృష్టికి తీసుకెళ్లాలని, ప్రతి కరెంటు వస్తువుకు 'ఎర్త్' తప్పనిసరిగా వుండాలని సూచించారు.

కనువిందు చేస్తున్న బ్రహ్మకమలాలు

ప్రజాశక్తి - వీరవాసరం




ఎక్కడో హిమాలయాల ప్రాంతాల్లో మాత్రమే లభ్యమగు బ్రహ్మకమలాలు బాలేపల్లి గ్రామంలో ఆదివారం వికసించి స్థానికులను కనువిందు చేస్తున్నాయి. చాలా అరుదుగా మాత్రమే ఈ బ్రహ్మకమలాలు హిమాలయ పర్వతాల్లో కనిపిస్తాయి. రాత్రుళ్లు మాత్రమే వికసించే ఈ మొక్క ఆకులే పువ్వులుగా రూపాంతరం చెందుతాయి. అటువంటి ఈ పుష్పాలు వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న యర్రంశెట్టి తాతాజీరావు ఇంటి వద్ద కింగ్ ఆఫ్ హిమాలయన్‌గా పిలిచే ఈ బ్రహ్మకమలాలు స్థానిక వాతావరణానికి తట్టుకుని విరభూయడం గమనార్హం. దీంతో ఈ పుష్పాలను స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

విద్యార్థికి మెరిట్ స్కాలర్‌షిప్ అందజేత

పలుచోట్ల గురుపౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి - కాళ్ల



స్కాలర్ షిప్ అందిస్తున్న అనంతలక్ష్మి సత్యవతిదేవి

మండలంలోని పలు సాయిబాబా దేవాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచే ఆలయాలకు యాత్రికులు క్యూ కట్టారు. గురుపౌర్ణమి సందర్భంగా సాయినాథుడి ఆలయాలన్నీ భక్తులతో రద్దీగా మారాయి. సీసలి సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు ట్రస్ట్ బోర్డ్ ఛైర్‌పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యవతిదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 3 వేల కలశాలతో అభిషేకాలు, 6 వేల లీటర్ల ఆవుపాలతో, 7 లక్షల రూపాయి బిళ్లలతో సాయిబాబాకు అభిషేకం నిర్వహించారు. ఆలయంలో పనిచేసే 150 మంది సేవకుల పిల్లలకు 5వ తరగతి నుంచి పీజీ వరకు చదువుకునే విద్యార్థులకు 3 లక్షల విలువైన మెరిట్ స్కాలర్ షిప్ అందించారు. మేడేపల్లి మల్లికార్జునరావు-పావని దంపతుల ఆర్థిక సహకారంతో అఖండ సమారాధన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో యాత్రికులు క్యూలో వెళ్లి సాయిబాబాను దర్శించుకున్నారు.

నరసాపురం : గురు పౌర్ణమి సందర్భంగా మండలంలోని కొప్పర్రు గ్రామంలో ఉన్న శిరిడి సాయి బాబా ఆలయంలో ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నాయకర్, సునీత దంపతులకు ఘనంగా సత్కరించారు. అనంతరం బాబావారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

మొగల్తూరు : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న సాయిబాబా ఆలయాల్లో ఆదివారం అన్న సమారాధన చేశారు. గురుపౌర్ణమి పురస్కరించుకుని బాబా ఆలయాల్లో యాత్రికులు ప్రత్యేక పూజలు చేశారు. మొగల్తూరు, రామన్నపాలెం, కేపీ పాలెం తదితర గ్రామాల్లో ఉన్న బాబా ఆలయాల్లో అన్న సమారాధనలు చేశారు.

ఉండి: మండల వ్యాప్తంగా అన్ని ఆలయాల్లోనూ గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉండి కొత్తపేటలో వేంచేసియున్న దత్త సాయి ఆలయంలో ఆలయ నిర్వాహకులు సన్నిధి రాజు చలపతిరావు ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించి అఖండ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కోలాటం గ్రూపు సభ్యులను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అంతకుముందు గుండాబత్తుల సుబ్బారావు దంపతులచే ఆషాడసారె 60 రకాల పిండివంటలతో అమ్మవారికి సమర్పించారు.

కానిస్టేబుల్ రమణకు ప్రశంసలు

ప్రజాశక్తి - పాలకొల్లు



కానిస్టేబులును ప్రశంసిస్తున్న ఆర్‌డిఒ అంబరీష్

పాలకొల్లు అగ్నిమాపక కేంద్రంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బివి.రమణకు నరసాపురం సబ్ కలెక్టర్ డాక్టర్ ఎం.అంబరీష్ ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా అచ్యుత అంబరీష్ మాట్లాడుతూ రమణ తన స్వగ్రామం పెనుగొండ మండలం ములపర్రులో బివి రమణ చారిటబుల్ ట్రస్ట్, శ్రీకృష్ణసాయి సేవాసమితి ద్వారా ఉచితంగా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ గుండె ఆపరేషన్లు, కంటి ఆపరేషన్లు చేయిస్తున్నారని ప్రశంసించారు. కరోనా సమయంలో కూడా ములపర్రు చుట్టుపక్కల గ్రామాల్లో 200 మందికి 2 నెలల పాటు ఆహారం అందించారని, పాలకొల్లులో రోడ్డు పక్కన ఉన్నవారికి శీతాకాలంలో రగ్గులు, దుప్పట్లు పంచి భోజనాలు పెట్టడం హర్షణీయం అన్నారు. ప్రస్తుతం సొంతంగా కైలాస రథం(శాంతి రథం), ఫ్రీజర్ బాక్స్, అత్యవసరాలకు హాస్పిటల్‌కి వెళ్లుటకు టు వీలర్ మోటార్ సైకిల్‌ని, అంబులెన్స్ అందుబాటులో ఉంచారని ప్రశంసించారు. అనాథ శవాలకు దహన సంస్కారాలు కూడా చేస్తున్నారని, అతి త్వరలో 100 మంది ఉండేటట్లు అనాథలకు అనాథ ఆశ్రమం, 200 మంది పేదలకు నిత్య అన్నదానం ఏర్పాటు చేయనున్నారని అభినందించారు. ఈ విధంగా డిపార్ట్మెంట్‌కు, సమాజానికి అనేక సేవలందిస్తున్న బివి రమణకు పెనుగొండ ఎస్‌వికెపి, పితాని వెంకన్న జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డిసి హనుమంతరావు, జిల్లా అగ్నిమాపక అధికారి బి.శ్రీనివాసరావు, పాలకొల్లు సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వైవి జానకిరామ్, ఫైర్ స్టేషన్ సిబ్బంది, గ్రామస్తులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

సహాయక చర్యల్లో అధికారులు..

ఉండి: యనమదుర్రు డ్రెయిన్ ఉగ్రరూపం దాల్చడంతో శనివారం రాత్రి నుంచి ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు ఆదేశాల మేరకు మండల అధికారులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉండి తహశీల్దార్ కొమ్మూరి శ్రీనివాస్ మాట్లాడుతూ యనమదుర్రు డ్రెయిన్ పొంగిపోవడంతో యండగండి పరిసర ప్రాంతాల్లోకి వరద నీరు పోటెత్తడంతో గ్రామాలన్నీ జలమయమవుతున్నాయన్నారు. విషయం తెలుసుకున్న ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు అధికారులతో కలిసి బలహీనంగా ఉన్న కాలువ గట్లపై ఇసుక, గ్రావెల్ బస్తాలు వేసి గట్లను బలోపేతం చేసి ఇబ్బందులు ఎదురవ్వకుండా సహాయక చర్యలు చేపట్టామన్నారు. శనివారం రాత్రి ఉండి ప్రధాన పంట కాలువ పొంగిపోవడంతో ఆ గ్రామ సర్పంచి సహకారంతో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం యనమదుర్రు కాలువ ఉధృతి నిలకడగా ఉందని తెలిపారు.

లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నరసాపురం ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్

యలమంచిలి: భద్రాచలం వద్ద ఆదివారం సాయంత్రానికి 41 అడుగులు నీటిమట్టం నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ధవళేశ్వరం వద్ద వరద నీటిమట్టం పెరిగే అవకాశం ఉన్న దృశ్య లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నర్సాపురం ఆర్‌డిఒ ఎం.అచ్యుత్ అంబరీష్ తెలిపారు. ఆదివారం సాయంత్రం లంక గ్రామాలైన బాడవ, యలమంచిలి గ్రామాల్లో పర్యటించి వరద పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే వరద ప్రభావిత ప్రాంతమైన కనకాయలంక, కాజ్ వేపై సుమారు అడుగుమేర వరద నీరు చేరిందని, ఇది మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆ గ్రామానికి రాకపోకలు బంద్ అయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజలు రాకపోకలకు పడవలను ఏర్పాటు చేయడంతో పాటు నిత్యావసర వస్తువులు సిద్ధంగా ఉంచడం జరిగిందని ఆయన తెలిపారు. ఆయన వెంట తహశీల్దార్ సిహెచ్.విజయశ్రీ పాల్గొన్నారు.

మెడికల్ క్యాంపునకు విశేష స్పందన

పాలకొల్లు: జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు ఆదివారం స్థానిక వీవర్స్ కాలనీలోని వీవర్స్ కళ్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ యాతం లక్ష్మి శ్రీరంగ కిడ్నీ, మూత్ర నాళం వ్యాధి నిపుణులు, డాక్టర్ ఆర్.రవికుమార్ గుండె వ్యాధి నిపుణులు, లయన్స్ కంటి ఆసుపత్రి వారిచే కంటి పరీక్షలు, శ్రీవిజయ డయాగ్నొస్టిక్ సెంటర్ వారిచే రక్త పరీక్షలు బిపి, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. 250 మంది రోగులు హాజరయ్యారు. వీరికి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వట్టం గణేష్, ప్రధాన కార్యదర్శి ద్వార హేమకుమార్, కోశాధికారి పాల్గొన్నారు.

జిల్లా సగటు వర్షపాతం 5.3 మిల్లీమీటర్లు

ప్రజాశక్తి - నరసాపురం

పశ్చిమగోదావరి జిల్లాలో వర్షపాతం వివరాలు అధికారులు ఆదివారం వెల్లడించారు. తాడేపల్లిగూడెం 11.4, ఇరగవరం11.2, పెనుమంట్ర 8.6, పెంటపాడు 8.4, ఉండి, పాలకోడేరు 7.2, గణపవరం 6.8, అత్తిలి 6.4, ఆకివీడు 6.0, పెనుగొండ 6.0, తణుకు 5.2, ఆచంట 5.0, పోడూరు 4.0, పాలకొల్లు 3.2, కాళ్ల 2.4, భీమవరం 2.2, మొగల్తూరు, యలమంచిలి 1.4, నరసాపురం 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో 20 మండలాలకు గాను 105.2 వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు వర్షపాతం 5.3 మిల్లీ మీటర్లు అని అధికారులు తెలిపారు.



1977-80వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

అలనాటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ..

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శ్రీవెలగపూడి రామకృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, 1977-80 బికాం బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం తాడేపల్లిగూడెం శశి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ సమావేశమునకు తెలుగు రాష్ట్రాల్లో స్థిరపడిన బికాం బ్యాచ్ మిత్రులు హాజరయ్యారు. ఈ సమావేశంలో కళాశాలలో జరిగిన తీపి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. కళాశాలలో తాము చేసిన నాటకాల దగ్గర నుంచి చదువు పూర్తయిన తరువాత వివిధ హోదాల్లో తాము పనిచేసిన కొలువుల గురించి ఈ సందర్భంగా సమావేశంలో గుర్తు చేసుకున్నారు. పరిచయ కార్యక్రమాల తరువాత చనిపోయిన మిత్రులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ కొద్ది నిమిషాలు మౌనం పాటించారు. ఈ అపూర్వ సమ్మేళమునకు శశి విద్యాసంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి వేణు గోపాలకృష్ణ, రాధారాణి దంపతులు ఆతిథ్యాన్ని అందించారు. అపూర్వ సమ్మేళమునకు అతిథులుగా విచ్చేసిన విద్యాసంస్థల వైస్ ఛైర్మన్, సెక్రటరీ, కరస్పాండెంట్ మేకా పరేంద్ర కృష్ణ, క్రాంతి సుధలు మాట్లాడుతూ టెలిఫోన్ నుంచి సెల్‌ఫోన్ వరకూ చూసిన యుగం మీది, ఈ వయస్సులో మీరు ఆరోగ్యంగా ఉంటూ ఇలా అపూర్వ సమావేశాలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఇటువంటి పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు ఎప్పుడు నిర్వహించుకున్నా తాము సహకరిస్తామని అన్నారు. ఈ సమ్మేళనంలో ఆతిథ్యాన్ని అందించిన బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ దంపతుల చేతులమీదుగా శ్రీవాణి గ్యాస్ అధినేత బ్రహ్మానందానికి మిత్రులు అందరూ సన్మానం చేశారు.



వరినాట్లు పరిశీలిస్తున్న నాయకులు

నీటమునిగిన వరినాట్లు పరిశీలన

యలమంచిలి: ఏకదాటిగా జిల్లాలో కురుస్తున్న అధిక వర్షాలకు దెబ్బతిన్న వరిపొలాలను, నారుమళ్లను ఆదివారం ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ మండలంలోని యలమంచిలి, మేడపాడు, గుంపర్రు, కాంబొట్లపాలెం గ్రామాల్లో పర్యటించి రైతులతో ముంపు సమస్యపై మాట్లాడుతూ గుంపర్రు, కాంబొట్లపాలెం ప్రాంతంలో 200 ఎకరాల్లో ఇరవైశాతం వరినాట్లు, 60 శాతం నారుమళ్లు పూర్తిగా దెబ్బతినే పరిస్థితి ఉందన్నారు. యలమంచిలిలోని, జలదిబ్బ, మంగలపర్ర, బండిరేవు, సత్తిమెళ్ల ప్రాంతంలో 400 ఎకరాల్లోనూ, మేడపాడు ఏరియాలో 100 ఎకరాల్లో వరినాట్లు, నారుమళ్లు దెబ్బతిన్నాయన్నారు. తక్షణం ముంపునీరు బయటకు వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, నారుమళ్లు దెబ్బతిన్న కౌలురైతులకు, సన్నాచిన్నకారు రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులిచ్చి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కౌలురైతులు జడ్డు బదరీనారాయణ, పల్లె వెంకట్రావు, ఉలసి సత్తిబాబు, జడ్డు తాతారావు, గాజులపాటి రమేష్, కవురు సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎంఎల్‌ఎకు వినతినందజేస్తున్న ఆశాలు

సమస్యలు పరిష్కరించాలని ఆశాల వినతి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం జనసేన కార్యాలయంలో ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్‌కు ఆదివారం ఆశ వర్కర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని గతంలో చేసిన ఆందోళన ఫలితంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను మినిట్స్ కాపీని కూడా ఎంఎల్‌ఎకి అందజేశామని తెలియజేశారు. సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆశ యూనియన్ నాయకురాలు ఎండీ బేగం మాట్లాడుతూ అసెంబ్లీలో ఆశాల సమస్యల మీద చర్చించి సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. సిఐటియు పట్టణ అధ్యక్షులు ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ ఆశ వర్కర్లు చాలా కాలంగా ప్రజానీకానికి వివిధ రకాల సేవలను అందిస్తున్నారని, అయినప్పటికీ వారి సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదని అన్నారు. ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సంధర్భంగా ఎంఎల్‌ఎ నాయకర్ మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బాధితులకు అండగా ఉంటాం

ముంపు గ్రామాల్లో పర్యటించిన ఎంఎల్‌ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - గణపవరం




బాధితులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ

వర్షాల వల్ల ముంపుకు గురైన బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పచ్చమట్ల ధర్మరాజు అన్నారు. ఆదివారం మండలంలో వర్షాల వల్ల ముంపుకు గురైన గణపవరం, పిప్పర, ఎస్ కొండెపాడు, కేశవరం, మొయ్యేరు, ముప్పర్తిపాడు గ్రామాల్లో మునిగిపోయిన వరి చేలను గ్రామాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రైతులను, బాధితులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని అన్నారు. మూడు రోజులుగా కురిసిన వర్షాల వల్ల కోమర్రు గ్రామంలో ఇళ్లల్లోకి నీరు చేరుకోవడంతో ఇబ్బంది పడుతున్న 13 కుటుంబాల వారికి జనసేన గ్రామ అధ్యక్షులు దాసం వెంకట కుమార్ ఏర్పాటు చేసిన బియ్యం, కాయగూరలు, నిత్యవసర వస్తువులు ధర్మరాజుకి అందజేశారు. గ్రామాల్లో ఎంతవరకు నష్టం కలిగిందో అధికారులు అడిగి తెలుసుకున్నారు. రైతులకు, నివాసులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. ఎస్ కోండేపాడులో ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్ర కాలవ గట్టు ఎత్తు పెంచి, పటిష్టం చేసి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని తెలిపారు. మొయ్యేరు, ముప్పర్తిపాడులో ముంపు గురైన పంట పొలాలను పరిశీలించారు. స్థానికులు పంట బోదెలకు అడ్డంగా తూరలు ఉండటం వల్ల నీరు వెళ్లక పొలాలు మునిగినట్లు చెప్పటంతో తూరలను వెంటనే తొలగించాలని అధికారులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి మండల నాయకులు పాల్గొన్నారు.

ముంపు ప్రమాద బాధితులను ఆదుకోవాలి

ఆహార పొట్లాలు అందజేసిన ఎంఎల్‌ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్



ఆహారం అందజేస్తున్న ఎంఎల్‌ఎ అంజిబాబు

అనార్థులను, ముంపు ప్రమాద బాధితులను ఆదుకోవడమే మానవ ధర్మమని, మనవసేవయే మాధవసేవ అని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం మెంటేవారి తోటలోని 2వ వార్డు, 38, 39వ వార్డుల్లోని ముంపు ప్రమాద బాధితులకు శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆదివారం ఆహార పొట్లాలను ఎంఎల్‌ఎ అంజిబాబు చేతుల మీదుగా అందించారు. భీమవరంలో దాతలకు కొదవలేదని, ఎటువంటి కష్టం వచ్చినా ముందుకు వచ్చి సహకారం అందిస్తున్నారని తెలిపారు. దాతలు శ్రీవిజ్ఞానవేదికను ఎంఎల్‌ఎ అంజిబాబు అభినందించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ కీర్తిశేషులు కనుమూరు వెంకట నరసమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు కనుమూరు రామకృష్ణంరాజు, గోపాలరాజు సౌజన్యంతో 200 మంది ముంపు బాధితులకు ఆహార పొట్లాలు, లక్కు సురేష్ సౌజన్యంతో దుర్గపురంలోని రెండు వార్డుల్లోని 80 మందికి ఆహార పొట్లాలను అందించామని, రెండు రోజులపాటు వారికి ఆహార పొట్లాలను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, విఆర్ఒ శ్యామ్, దాతలు కనుమూరు వెంకట నరసమ్మ, బంధువులు, కట్టా నరసింహస్వామి, నరహరిశెట్టికృష్ణ, లక్కు సురేష్ పాల్గొన్నారు.

ప్రాణాపాయ స్థితిలో బెంగాలీ కార్మికుడు

పరామర్శించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - పెనుగొండ

పశ్చిమ బెంగాల్ రాష్ట్రం నుంచి పొట్ట చేత పట్టుకుని పొలం పనుల కోసం ఆంధ్రప్రదేశ్ వస్తున్న బెంగాలీ కార్మికుల ప్రాణానికి భద్రత లేకుండా పోయింది. ఆదివారం దేవ గ్రామంలో పంట చేను ఊడ్పుల కోసం ఆకుతీస్తున్న కార్మికుని వేలిపై రక్తపింజరి అనే ప్రమాదకరమైన విష పాము కాటేసింది. పాముకాటుకు గురైన కార్మికుడికి పెనుగొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డాక్టర్లు వైద్యం అందిస్తున్నారు. ఈ విషయం తెలిసి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కేతా గోపాలన్ కార్మికుడిని కలిసి పలకరించడానికి ఆసుపత్రికి వెళ్లారు. అనంతరం ఆసుపత్రి వైద్యులు పి.భాస్కర రావును కార్మికుడి పరిస్థితిని అడిగి తెలుసుకునే క్రమంలో రక్త పింజర పాము విషపూరితమైందని అన్నారు. పాము కాటుకు గురైన కార్మికుని వేలు రెండు అంగుళాలు విష ప్రభావంతో నల్లబడిందని, అవసరమైన తక్షణ వైద్యం అందిస్తున్నామని తెలిపారు. విష ప్రభావానికి మెదడు, మూత్రపిండాలు దెబ్బతినవచ్చని, రక్తపువాంతులు కూడా చేసుకోవచ్చునని తెలిపారు. శరీరంలోకి వెళ్లిన విష ప్రభావాన్ని అంచనా వేసి అవసరమైన వైద్య సహకారం కోసం ఇతర ఆసుపత్రులకు సూచిస్తామన్నారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఇటీవలే వడలి గ్రామ సమీపంలో పాము కాటుకు గురైన బెంగాలీ కార్మికుడు మృతి చెందాడని, ఇతను రెండో వ్యక్తన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాముకాటుకు గురవుతున్న బెంగాలీ కార్మికులకు ఇన్సూరెన్స్ పథకం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, నాగిశెట్టి గంగారావు, చిలుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్రీను కుటుంబానికి న్యాయం చేయాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి పివి ప్రతాప్

ప్రజాశక్తి - తణుకు

విద్యుత్ ప్రమాదంలో మృతిచెందిన చిటికెల శ్రీను కుటుంబానికి మున్సిపల్ అధికారులు ఇచ్చిన హామీలు చిత్తశుద్ధితో అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం సిఐటియు, ఎఐటియుసి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర ఆసుపత్రి వద్ద మృతుడు కుటుంబానికి న్యాయం చేయాలని నిరసన వ్యక్తం చేశారు. తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, మున్సిపల్ కమీషనర్ బివి రమణ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నాయకులు పివి ప్రతాప్, ఎఐటియుసి నాయకులు బొద్దాని నాగరాజు, ఐలు జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి పాల్గొని ఇరు పక్షాలు చర్చలు జరిగిన తరువాత శ్రీను కుటుంబానికి మున్సిపాలిటీ నుంచి రూ.5 లక్షలు, విద్యుత్ డిపార్ట్మెంట్ నుంచి రూ.5 లక్షలు, సిఎంఆర్ఎఫ్ నుంచి రూ.5 లక్షలు, తణుకు మున్సిపాలిటీ నుంచి రూ.2 లక్షలు మొత్తం రూ.17 లక్షలు ఇవ్వడానికి అంగీకారం తెలిపారన్నారు. ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన చర్చలు జయప్రదం అయినందున ఆందోళన విరమించారు. అనంతరం ఎంఎల్‌ఎ రాధాకృష్ణ తరపున రూ.50 వేలు, కమీషనర్ తరపున రూ.15 వేలు శ్రీను భార్యకి అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.ఆదినారాయణబాబు, వై.మందులయ్య, మంగ, అయ్యప్ప దేవి, ధనలక్ష్మీ, శ్రీను, నాగేంద్రకుమార్, అనంతలక్ష్మీ, ముత్తయ్య పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సాయం అందించిన ఎంఎల్‌ఎ

విధి నిర్వహణలో కరెంటు షాక్ తగిలి మృతి చెందిన మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు చిటికెల శ్రీను కుటుంబ సభ్యులను తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పరామర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ అంకిత భావంతో పనిచేసే సిబ్బందిలో ఒకరైన శ్రీను అకాల మరణం బాధాకరమన్నారు. ప్రభుత్వం తరపున వారి కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ నుంచి వచ్చే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు టిడిపి తరపున రూ.50 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కుటుంబానికి ఇళ్ల స్థలం, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు.

నష్టపోయాం ఆదుకోండి : రైతులు

ప్రజాశక్తి - ఉండి

ఇటీవల కూరుస్తున్న అధిక వర్షాల వల్ల నారుమడులు నష్టపోయిన రైతులను ఆదుకుని విత్తనాలు ఉచితంగా అందించాలని రైతులు జిల్లా వ్యవసాయ అధికారి జెడి జెడ్ వెంకటేశ్వరరావును కోరారు. ఆదివారం అధిక వర్షాల ప్రభావం వల్ల యండగండి మీడియం డ్రెయిన్‌ను ఆనుకుని ఉన్న యండగండి, ఉప్పులూరు, చిలుకూరు గ్రామాల్లోని ముంపుకు గురైన పంట పొలాలను, నారుమడులను మండల వ్యవసాయాధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో జెడ్ వెంకటేశ్వరరావు క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా జెడ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అధిక వర్షాల కారణంగా పంట పొలాల్లో నిలిచిన నీరు తగ్గిన వెంటనే స్వల్పకాలిక రకాలైన ఎంటియు 1153, ఎంటియు 1156 రకాలను పంటగా వేయాలని రైతులకు సూచించారు. మీడియం డ్రెయిన్‌కు మరమ్మతులు చేపట్టాలని గతంలోనే ఆ శాఖ అధికారులను కోరడం జరిగిందని, కానీ పనులు ఇంకా ప్రారంభించకపోవడంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు ముంపుకు గురై రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టి యండగండి మీడియం డ్రెయిన్‌ను ప్రక్షాళన చేసి మరమ్మతులు జరిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.మేఘన, రైతులు పాల్గొన్నారు.

తక్షణం రక్షణ చర్యలు చేపట్టాలి

జిల్లా వ్యవసాయ శాఖ జెడి వెంకటేశ్వరరావు

పాలకోడేరు : అల్పపీడనం ప్రభావంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నారుమడులు, నాట్లు వేసిన వరి చేలు ముంపు బారిన పడ్డాయని, ఈ నేపథ్యంలో రైతులు తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ జెడి జెడ్ వెంకటేశ్వరరావు సూచించారు. మండల పరిధిలోని గరగపర్రు, మొగోళ్లు, కోరుకొల్లు గ్రామాల్లో పాలకోడేరు వ్యవసాయ అధికారి వి.నారాయణరావుతో కలిసి ఆదివారం పర్యటించారు. ముంపు ప్రాంత పొలాలను పరిశీలించిన జెడి రైతులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. జిల్లాలో 32,427 ఎకరాల్లో నాట్లు వేసిన వరిచేలు, 2,751 ఎకరాల్లో ఆకుమడులు ముంపు బారిన పడ్డాయని తెలిపారు. మండలంలో 90 ఎక్టార్లలో నారుమళ్లు, 300 హెక్టార్లలో నాట్లు వేసిన చేలు నీట మునిగాయని అన్నారు.

సంగీత దర్శకులు సతీష్ బాబు మృతి

ఉండి: కన్నడ సంగీత దర్శకులు గడి సతీష్ బాబు(49) అనారోగ్యం కారణంగా సతీష్ బాబు స్వస్థలం ఉండి గ్రామంలో ఆదివారం ఉదయం కన్నుమూసినట్లు ఆయన సోదరులు గడి నరేంద్ర తెలిపారు. గడి సతీష్ బాబు కన్నడ సినీ రంగంలో చాలా సినిమాలకు సంగీత దర్శకత్వం వహించారన్నారు. గత సంవత్సర కాలంగా అనారోగ్య కారణంగా సినిమాలకు దూరంగా ఉన్న సతీష్ బాబు ఉండి గ్రామంలోని ఆయన ఇంటి వద్దనే చికిత్స పొందుతున్నారని, ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నట్లు నరేంద్ర వివరాలు తెలిపారు. సతీష్ బాబు మరణంతో ఉండిలో విషాదఛాయలు అలముకున్నాయి. సతీష్ బాబు తల్లి మాజీ మండల పరిషత్ అధ్యక్షురాలు కావడంతో పలు రాజకీయ పార్టీ నాయకులు సతీష్ బాబు మృతదేహానికి నివాళులర్పించారు.

వృద్ధులకు ఉచిత వైద్యసేవలు

తణుకు: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించు ఇంటింటికీ వైద్యంలో భాగంగా ఆదివారం ప్రముఖ నేత్ర వైద్యులు డా.హుస్సేన్ అహ్మద్ తణుకు, పైడిపర్రు, కె.సావరం ప్రాంతాల్లో పర్యటించి సుమారు 9 మంది వృద్ధులకు ఉచిత వైద్యసేవలు అందించారు. సంఘ సభ్యులు ఎం.రవిరెజినాల్డ్ ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మ సన్నిధిలో ప్రజాప్రతినిధులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కు బడులు చెల్లించుకున్నారు. భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు, జనసేన జిల్లా అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు, తూర్పుగోదావరి జిల్లా మురమళ్లలో ఉన్న వీరేశ్వర స్వామి ఆలయ గ్రేడ్ వన్ కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఇఒల అసోసియేషన్ అధ్యక్షులు, అమలాపురంలోని సుబ్బాలమ్మ అమ్మవారి ఆలయ కార్యనిర్వాహణాధికారి బొక్క వీర వెంకటేశ్వరరావు, విశ్రాంత ఇఒ అంబటి గణేశ్వరరావులను ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వారు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వారికి అమ్మవారి శ్వేత వస్త్రం, ప్రసాదాలను అందించారు.

గంగాలమ్మ సన్నిధిలో నాయకర్

నరసాపురం: మండలంలోని లింగనబోయిన చర్ల గ్రామంలో వేంచేసియున్న గంగాలమ్మ అమ్మవారిని నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ దర్శించుకున్నారు. అత్యధిక మెజార్టీతో గెలిచినందుకు 108 టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఆయన వెంట కటకంశెట్టి సంజీవ్ రావు, బర్రె నాని, అడబాల చిన్న ఉన్నారు.